

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

31 డిసెంబర్ 2025 పేజీలు : 08


### శ్రీవారిని దర్శించుకున్న
## వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు మంగళవారం తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద వారు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, నియోజకవర్గ అభివృద్ధి నిరంతరం కొనసాగాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

- మంత్రి నారాయణ
- 5వ డివిజన్లోని వైకుంఠపురంలో పర్యటించిన మంత్రి
- స్థానిక గిరిజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామంటూ హామీ
- ఇచ్చిన మాట ప్రకారం వారంలోపే తమ ప్రాంతానికి వచ్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు



### పేదల అభ్యున్నతే..
## కూటమి ప్రభుత్వ లక్ష్యం

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

పేదల అభ్యున్నతి కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని ఐదో డివిజన్లో వైకుంఠపురంలో మంగళవారం పర్యటించారు. గత వారం క్రితం ఆ ప్రాంతవాసుల ముంపు సమస్యను తన దృష్టికి తీసుకుని వచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం అధికారులతో కలిసి వైకుంఠపురం ఏరియాలో పర్యటించినట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను తెలుసుకుని వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇబ్బందులు చెప్పిన వారంలోపే తమ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. గత వారంలో ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం వైకుంఠపురానికి రావడం జరిగిందని, ప్రతి గడపకు వెళ్ళినప్పుడు వారి యొక్క సమస్యను తెలియజేశారని తెలిపారు. అధికారుల సమక్షంలోనే సమస్యను పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు. వర్షాల్లో ముంపుకు గురైన 22 ఇళ్ళను గుర్తించామని, వాళ్ళ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. స్లమ్ ఏరియాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి

-మిగతా 2లో



## కాకాణిపై కేసుకు హైకోర్టు స్టే

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :**

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచల సత్రం పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి కాకాణిపై నమోదైన కేసులో హైకోర్టు స్టే విధించింది. ఎఫ్ఐఆర్ నం.173/2025 (06-12-2025)కు సంబంధించిన తదుపరి అన్ని చర్యలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కాకుటూరు శివాలయ భూముల విషయంలో జిల్లా దేవదాయ శాఖ అధికారిని కలిసి వినతి పత్రం సమర్పించి, మీడియాతో మాట్లాడినందుకు కాకాణిపై బియన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై కాకాణి హైకోర్టును ఆశ్రయించగా, కేసును విచారణకు స్వీకరించిన న్యాయస్థానం స్టే విధించింది.

### పేదలకు సొంత ఇంటిని పూర్తి చేసి ఇవ్వడమే..
## ప్రధాన లక్ష్యం

**గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ పి.అరుణ్‌బాబు**



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

పేదలకు సొంత ఇంటిని పూర్తి చేసి ఇవ్వడమే ప్రధాన లక్ష్యంగా గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పని చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మేనే జింగ్ డైరెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌బాబు అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

### ఆప్షన్-3 ఇళ్ల లోటుపాట్లును సరిచేయండి.. బిల్లులు చెల్లిస్తున్నాం

ఆప్షన్-3 కింద నిర్మించిన ఇళ్లల్లో నాణ్యతగా లేని వాటిని గుర్తించి లోటుపాట్లను వెంటనే సరి చేయాలని కాంట్రాక్టర్లకు హౌసింగ్ ఎండీ అరుణ్ బాబు సూచించారు. జిల్లాలో సుమారు 6899 ఇళ్లల్లో

-మిగతా 2లో

### సతీమణితో కలిసి వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న
## మంత్రి నారాయణ




- మంత్రి నారాయణకు దంపతులకు ఘన స్వాగతం పలికిన అర్చకులు
- స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి దంపతులు

# ఏకగ్రీవంగా ఏపీ ఎన్జీవో ఎన్నికలు






**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నెల్లూరు జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినట్లు ఎన్నికల అధికారి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాఘవులు తెలిపారు. స్థానిక ఏపీ ఎన్జీవో హోమ్‌లో మంగళవారం ఉదయం 10 గంటల నుండి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైనది జిల్లాలో ఉన్న 17 పదవులు గాను 17 నామినేషన్స్ వచ్చినందున ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి సిహెచ్ రాఘవులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బందారుపల్లి వెంకటేశ్వర్లు, సహ అధ్యక్షుడిగా ఎన్.ఆంజనేయ వర్మ, ఉపాధ్యక్షులుగా కే.రాజేంద్రప్రసాద్, పి.కిరణ్ కుమార్ పి.సతీష్‌బాబు, పి.జనార్దన్ రావు, టి.మల్లికార్జున రావు, మహిళా ఉపాధ్యక్షులు కరుణమ్మ, జిల్లా కార్యదర్శిగా గాదిరాజు రామకృష్ణ, కార్యనిర్వాహణ కార్యదర్శిగా లక్కాకుల పెంచలయ్య, సంయుక్త కార్యదర్శిగా పి.రవికుమార్, ఎన్.గిరిధర్, సిహెచ్ వీరబ్రహ్మేశ్వరరావు, కే.సురేష్, ఎన్.రాజేంద్ర, మహిళా సంయుక్త కార్యదర్శిగా పి.రమ్య, కోశాధికారిగా వీఎంవీ ప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన నేతలతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి చిత్తూరు జిల్లా కార్యదర్శి కె.రమేష్ ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షకులుగా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కె.జగదీష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యోగులందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## 'సూర్య' కేలండర్ ఆవిష్కరించిన కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో సూర్య పేపర్ క్యాలెండర్‌ను సోమ వారం కమిషనర్ వైవో. నందన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూర్య తెలుగు దినపత్రిక బ్రాంచ్ మేనేజర్ ఎ.రవితేజ, నగర పాలక సంస్థ టిపిఆర్ఓ వాసు బాబు, హెల్త్ ఆఫీసర్ కనకాద్రి, కార్పొరేషన్ రిపోర్టర్ సయ్యద్ మహమ్మద్ రఫీ, క్రైమ్ రిపోర్టర్ ఉదయ్ కుమార్, విజయ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# పేదలకు సొంత ఇంటిని పూర్తి చేసి ఇవ్వడమే ప్రధాన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

శ్లాబులు, గోడ నిర్మాణాలు, బేస్‌మెంట్లు నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. యుద్ధప్రాతిపదికన ఈ ఇళ్ల నిర్మాణాల మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. పూర్తి చేసిన ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం భరోసాగా ఉంటుందని, ఇది చివరి అవకాశంగా భావించి వెంటనే ఆప్షన్-3 ఇళ్లను పూర్తి చేయాలన్నారు.

### ఉగాది లోపు లక్ష్యాలను అధిగమించాలి.. బాధ్యతగా పని చేయండి !

జిల్లాలో గృహ నిర్మాణశాఖ అధికారులు బాధ్యతగా పని చేసి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాదిలోగా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించారని, ఈ మేరకు జిల్లాకు కేటాయించిన 27820 ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఏజెన్సీల కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ ప్రతిరోజూ ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించాలన్నారు. ఏఈలు, డీఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధతో ఇళ్ల నిర్మాణాల స్టేజ్




కన్వర్షేషన్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన నాణ్యతా ప్రమాణాలు లేని ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లచేత సరిచేయించి వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఇళ్లల్లో చేరిన లబ్ధిదారులకు అవసరమైన అదనపు సహాయాన్ని ప్రభుత్వం చేస్తుందన్నారు. ఫ్యాన్లు, లైట్లకు, అదనపు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. నూతనంగా పీఎంఎవై 2.0లో మంజూరైన ఇళ్లను మొదలుపెట్టించాలన్నారు.

### పోటీతత్వంతో పనిచేయండి : కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. ఉగాదిలోగా జిల్లాకు కేటాయించిన ఇళ్లను పూర్తి చేసేందుకు అధికారులందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ 3 నెలల సమయం చాలా కీలకమైందన్నారు. పోటీతత్వంతో గృహ నిర్మాణ శాఖ అధికారులు పని చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సిమెంటు, స్టీలు, మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. బిల్లులు కూడా త్వరగా మంజూరు అవుతున్నట్లు చెప్పారు. అధికారులు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ ఆప్షన్-3 ఇళ్లను వేగంగా పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. అలాగే ఆప్షన్-3లో గుర్తించిన నాణ్యత లేకుండా నిర్మించిన ఇళ్లను తిరిగి నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. వీలైనన్ని ఎక్కువ ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించి పేదలకు అందించడమే లక్ష్యంగా బాధ్యతగా పని చేయాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ అధికారులు మోహన్ రావు, మాధవరావు, ఏఈలు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ ఏజెన్సీల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టారన్నారు. వైజాగ్ లక్ష్మీపురం స్లమ్ ప్రాంతంలో 170 కుటుంబాల కోసం పిపిపిలో 20 అంతస్థుల భవనం నిర్మిస్తున్నామన్నారు. అంతేకాకుండా పేదల అభ్యున్నతే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలియజేశారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, ఇంచార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అనురాధ, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ ప్రెసిడెంట్ గంగాధర్, కోదండరామాలయ చైర్మన్ సిరి శ్రీనివాస్, కార్పొరేషన్, రెవెన్యూ ఎలెక్ట్రికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీకి ధన్యవాదాలు తెలిపిన కలువాయి నాయకులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కలువాయి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించేలా చూడాలని ఇటీవల కలువాయి మండల కూటమి నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు, తదితరులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇదే విషయాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ప్రభుత్వం కలువాయిని నెల్లూరు జిల్లాలో కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. దాంతో నాయకులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమరి కృషితో ఇది సాధ్యమైందని వారు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకి, కూటమి ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు. కలువాయి టీడీపీ మండలపార్టీ కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి, మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మల్లికార్జున్, జనసేన కన్వీనర్ మనోహర్, యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల సంఘం మార్గదర్శకాలను

## కచ్చితంగా అమలు చేయాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. మంగళవారం నెల్లూరు నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన మూడు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, పి కోటేశ్వర్ రెడ్డి, బాల సుధాకర్, జిల్లా రెవెన్యూ అధికారి కె విజయ్ కుమార్, ఆర్డీవో అనూష, తాసిల్దార్ షఫీమాలిక్, ఎలక్షన్ డీటీలు అఫ్జర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సీఐటీయు నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఏసీ మార్కెట్ నుంచి వేదయపాలెం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు రూరల్ అధ్యక్షులు ఎం సుధాకర్, ఆటో కార్మిక సంఘం రూరల్ కార్యదర్శి దేవతాటి లవన్ కుమార్ మాట్లాడుతూ.. సీఐటీయు అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్నాయి. జనవరి 4వ తేదీ విశాఖ నగరంలో భారీ ప్రదర్శన బహిరంగ సభ ఉంటుంది. ఆటో కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది. సీఐటీయు అనుబంధ రంగా కార్మికులు అధిక సంఖ్యలో విశాఖ నగరానికి తరలిరావాలని అందుకు సీఐటీయు బస్సులు కూడా ఏర్పాటు చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు కోట్స్‌గా చేయడం జరిగిందని తెలిపారు. దీని వలన కార్మికులు సమ్మె చేసుకునే హక్కు బేరసారాలు ఆడే హక్కు ఎనిమిది గంటల పని దినాలు ప్రమాదంలో పడ్డాయి. ఈ పరిస్థితులలో జరిగే సీఐటీయు అఖిలభారత మహాసభలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ మహాసభలో కార్మికుల హక్కుల మీద చర్చించి పలు తీర్మానాలు చేయడం జరుగుతుంది. భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుంది. ఈ మహాసభలకు భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు ఇతర దేశాల నుంచి సౌహార్ద సందేశం ఇచ్చేందుకు ప్రతినిధులు హాజరవుతున్నారు. ఈ మహాసభలను జయప్రదం చేసే దానిలో భాగంగా కార్మికులు విశాఖకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ ఉపాధ్యక్షులు కొండా ప్రసాద్, పీ.నరసింహారెడ్డి, కే.పెంచలయ్య, కె.సామ్సన్, కట్టా సతీష్, ఎస్‌డి హమీద్, శ్రావణ్ కుమార్, నందిపాటి మాలకొండయ్య, గోపాల్, బొజ్జ ప్రసాద్,కావలి సురేష్ పాల్గొన్నారు.



# గండిపాళెంలో హిందు సమ్మేళనం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం గ్రామ శ్రీకోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హిందు సమ్మేళనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ శుద్ధ చైతన్యానందగిరి స్వామిజీ భక్తులకు సందేశమిచ్చారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరు పాటుపడాలన్నారు. మన కుటుంబంతోనే దేశానికి ముప్పు ఉందని, కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. సమాజానికి ఆదర్శమైన కుటుంబాన్ని అందించాలన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు సంస్కారం నేర్పించాలన్నారు. నగర ప్రాంతాల్లో ఉన్న పిల్లలు వ్యసనాలకు గురవుతున్నారని, వారిని కా పాడాల్సిన బాధ్యత తల్లిండ్రులపై ఉందన్నారు. అనంతరం సుదర్శన హెూమం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామంతో పాటు చుట్టపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గండిపాళెం జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు గడ్డం ప్రసాద్, మన్నేటి శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, అంకయ్య, బీ.వెంకటేశ్వర్లు, కేశవలింగం, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కరెంటోళ్ళ జనబాట



**కావలి, మేజర్‌న్యూస్ :** మంగళవారం నెల్లూరు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో కరెంటోళ్ళ జనబాట కార్యక్రమంను అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కావలి డివిజన్ పరిధిలోని రుద్రకోట గ్రామంలో పర్యటించి, ఇక్కడి విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్షంగా సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను, అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంనీ సందర్శించి సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) మాట్లాడుతూ.. వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఈ కరెంటోళ్ళ జనబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించబడుతుందని, అలాగే ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుండి 9:30 గంటల వరకు జరుగుతుందని రైతులకి విద్యుత్ వినియోగదాలకి ఏమైనా సమస్యలు ఉంటే తెలపవచ్చునని వివరించారు. అధికారులకు సిబ్బందికి, వినియోగదారులకు, రైతులకు రాబోవు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు, రాబోవు నూతన సంవత్సర సందర్భంగా అందరికీ మంచి జరగాలని రైతులు సమృద్ధిగా పంటలు పండించి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. ఫీల్డ్‌లో గుర్తించిన లూజ్ లైన్లు, డామేజ్ అయిన పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు, చెట్ల కొమ్మలు, విద్యుత్ లైన్లను తాకడం, కండక్టర్ డామేజ్ వంటి అన్ని సమస్యలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ఆర్డీఎస్ఎస్ స్కీమ్ ద్వారా ప్రతి పల్లెకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా అంతటా ఆర్డీఎస్ఎస్ పథకం సమర్థవంతంగా అమలవుతోందని తెలిపారు. ఫీల్డ్‌లో అధికారులు పర్యటించిన సందర్భంగా వినియోగదారుల నుంచి వచ్చిన స్పందనపై వివరాలు సేకరిస్తున్నామని, అలాగే ఈ యాప్ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది గమనించిన లోపాలు ఏవైనా ఉంటే వాటిని కార్పొరేట్ ఆఫీస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని జిల్లా సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావలి బెనర్జీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కోడూరు-1, ఈదూరు-2 రెవెన్యూ భూములు రిసర్వే ప్రాజెక్టు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు-1, ఈదూరు-2 గ్రామాల్లో రిసర్వే ప్రాజెక్టు క్రింద గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను 2026 జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తాసిల్దార్ వి.సుధీర్ తెలిపారు. రిసర్వే ప్రాజెక్టు అమలులో భాగంగా భూ సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డుల సరిపోల్చే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ భూములకు సంబంధించిన పాత పత్రాలు, రికార్డులు సిద్ధంగా ఉంచుకొని అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు. గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయ్యాక భూ రికార్డుల్లో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు రైతులకు స్పష్టమైన భూ హక్కులు కల్పించేందుకు ఈ రిసర్వే ఎంతో ఉపయోగపడనుందని తెలిపారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి : సీఐటీయు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని సిఐటియు కార్యదర్శి మారు బోయిన రాజా మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాచర్లపాడు వద్ద ఇఫ్కో- కిసాన్ సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను వెంటనే ఆపాలి. పరిశ్రమ వల్ల ప్రజల ఆరోగ్యం చాలా ప్రమాదంలో పడుతుంది. జిల్లాకు లాభంకంటే నష్టం 100రేట్లు అధికం. కావున పరిశ్రమకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతి ఉపసంహరించాలి. ఈ ఉద్యమంలో ఈరోజు ప్రజాస్వామ్య బద్దంగా నిరసన తెలియజేయుచున్న నాయకులను, ప్రత్యేకంగా సిపిఎం పార్టీ నాయకులను హౌస్ అరెస్టులు, నిరసన తెలియజే స్తున్న నాయకులను అరెస్ట్ చేయడం రాజ్యాంగ వ్యతిరేకం, అప్రజాస్వామికం ప్రభుత్వ చర్యలను సీఐటీయూ ఖండిస్తుందన్నారు.

# నడిరోడ్డుపై వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఉదయగిరి సర్కిల్ పరిధిలో నడిరోడ్డుపై వేడుకలు నిర్వహించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి సీఐ ఎన్.వెంకటరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డితో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రిబుల్ రైడింగ్ నిషేధమన్నారు.. పోలీసుల అనుమతి లేకుండా నూతన సంవత్సర వేడుకల, పార్టీలు నిర్వహించరాదన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. ప్రధాన సెంటర్లు, సున్నిత ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

# యూటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భవానీ, మండల విద్యాశాఖ అధికారులు జి.శ్రీనివాసులు, షేక్ జిలాని, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్ను అశోక్‌రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి నల్లవడ్ల వెంకటరమణారెడ్డి తదితరులు యుటిఎఫ్ మండల శాఖ నాయకులతో కలసి నూతన సంవత్సరం 2026 క్యాలెండర్, నూతన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ శాఖ నాయకులు జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, అధ్యక్షుడు కుంచం వెంకటేశ్వర్లు, కోశాధికారి కేవీ బాలప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.శివసాయి మండల నాయకులు జి.పెంచల నరసయ్య, బి.వెంకటేశ్వర్లు, ఆర్.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# మాగుంట సుబ్బరామరెడ్డి జ్ఞాపకార్థం రక్తదానం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.ఉమ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కళాశాలలో స్వర్గీయ సుబ్బారామిరెడ్డి జ్ఞాపకార్థం వారి వర్ధంతి రోజున రక్తదాన శిబిరం కావలి రెడ్‌క్రాస్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, ఈ సంవత్సరం వర్ధంతి రోజున తుఫాన్ కారణంగా వాయిదా పడటంతో ఈరోజు నిర్వహిస్తున్నామని అన్నారు. జ్యోతి ప్రజ్వ లనతో ఈ కార్యక్రమాన్ని కావలి రెడ్‌క్రాస్ ట్రెజరర్ ఆరికట్ల మధుసూధన రావు, వైస్ చైర్మన్ కె.హరినారపరెడ్డి ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది, రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ గడ్డం శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ టి.ఉమ, వైస్ ప్రిన్సిపల్ కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వారు బహుమతులు అందించారు.

## ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిపై ఘాటుగా స్పందించిన

# ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్

- రాజకీయ అనుభవం లేక తప్పుడు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు
- చెప్పుడు మాటలు విని విమర్శలు చేయడం సిగ్గుచేటు
- మాట్లాడేటప్పుడు తెలుసుకుని మాట్లాడటం నేర్చుకో అని హితవు ?

పలికిన రూప్ కుమార్ యాదవ్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** రాజకీయ అనుభవం లేక మంత్రి నారాయణపై తప్పుడు విమర్శలు చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిపై ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదో డివిజన్లోని వైకుంఠపురంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారాయణ సర్ పై విమర్శ చేసే స్థాయి నీది కాదన్నారు. చెప్పుడు మాటలు విని విమర్శలు చేయడం సిగ్గుచేటని రూప్ కుమార్ యాదవ్ తెలిపారు. మంత్రి నారాయణ సార్ కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడిన మాటలు విని స్పందించాలని చంద్ర శేఖర్ రెడ్డికి హితవుచేశారు. అసలు మంత్రి నారాయణ చాలా స్పష్టంగా చెప్పారని, నోటికి ఏదొస్తే అది వాగడం సరికాదన్నారు. వైఎస్సార్సీపీ అధి కారంలో ఉండగా టీడీపీ నేతలపై అక్రమంగా, అన్యా యంగా, దుర్మార్గంగా రౌడీ షీట్‌లు పెట్టారని, అటువంటి తప్పుడు కేసులతో ఇబ్బందిపడుతున్న కార్యకర్తల అభ్యర్ధనను పరిశీలిస్తానన్నారని, తప్పుడు రౌడీ షీట్లని తేలితే తొలగించి న్యాయం చేస్తామన్నారని తెలిపారని తెలియ జేశారు. ఆమా టలను వక్రీకరించి మాట్లాడటం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. ఏదైనా మాట్లాడేటప్పుడు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని, పోలీసు నియమావళి ప్రకారం ప్రతీ సంవత్సరం డిసెంబర్‌లో రౌడీ షీట్లు తొలగిస్తారని తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ స్ట్రీట్‌పై కూడా విమర్శలు చేస్తున్నారని మండి పడ్డారు. ఎంతో మంది నిరుపేద మహిళలకు స్మార్ట్ సిట్ బజార్లో మెప్మా మహిళలకు 120 షాపులు కేటాయించారని, మంత్రి నారా యణ సొంత నిధుల నుండి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు వంతన ఆర్థికంగా సహాయం చేశారని గుర్తు చేశారు. ఏ వ్యాపారమైనా ప్రారంభిస్తే నిలదొక్కు కొనేందకు కొంత సమయం పడుతుందని, చంద్రశేఖర్ రెడ్డి విద్యాసంస్థ ప్రారంభానికి ఇప్పటికీ వ్యత్యాసం లేదా అని ప్రశ్నించారు. పేదకుటుంబాల అభ్యున్నతికి మంత్రి స్మార్ట్ స్ట్రీట్‌ని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారన్నారు. విషయం తెలియకపోతే తెలుసుకోవాలని చంద్రశేఖర్ రెడ్డికి రూప్ కుమార్ యాదవ్ సూచించారు. రాజకీయ అనుభవం లేక తప్పుడు విమర్శలు చేస్తున్నారని తనదైన శైలిలో మండిపడ్డారు.

## బీపీఎస్ ఎల్‌ఆర్‌ఎస్ సద్వినియోగం చేసుకోండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాల పట్ల అర్హులైన ప్లాట్ల, భవనాల యజమానులకు అవగా హన కల్పించి పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో భాగస్వాములు కావాలని సూచించారు. బీపీఎస్ పథకం ద్వారా అనుమతులను అతిక్ర మించి కట్టిన కట్టడాలకు పూర్తిస్థాయిలో యాజమాన్యపు హక్కును పొంద డమే కాకుండా ఆస్తి పన్ను, కుళాయి పన్ను, విద్యుత్ బిల్లు తదితర వాటిలో అధిక మొత్తం అపరాధ రుసుములు చెల్లించకుండా సడలింపును పొందేం దుకు కూడా అర్హులవుతారని వివరించాలని ఎల్‌టీపీలకు కమిషనర్ సూచించారు. నిర్దేశించిన గడువులోపు అర్హులైన అందరి ద్వారా ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాలను అందించేలా భాగస్వాములై పథకాలను విజయవంతం చేయాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హిమబిందు, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రఘునాథరావు, ఏసీపీలు, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల అధ్యయనం, పరిష్కారం లక్ష్యంగా విలేజ్‌విజిట్ : తహశిల్దార్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల అధ్యయనం, పరిష్కారం లక్ష్యంగా విలేజ్‌విజిట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆత్మకూరు తహ శిల్దారు పి.పద్మజాకుమారి పేర్కొన్నారు. 'వన్‌మంత్ వన్‌విలేజ్ ఫోర్‌విజిట్స్' కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలం పాతజంగాలపల్లిలో మంగళ వారం మూడవవిడతగా గ్రామసభను నిర్వహించారు. తహశిల్దారు పి.పద్మ జాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రభుత్వం నిర్ధేశించిన కార్యక్రమంలో భాగంగా క్రమం తప్పకుండా నెలలో ఒక గ్రామాన్ని నాలుగుదపాలుగా విచ్చేస్తున్నామని, ప్రజాసమస్యలు తెలుసు కుంటున్నామని, ప్రజలనుండి అర్జీలు స్వీకరిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. గత రెండు వారాల్లో ఇక్కడకు విచ్చేసిన సందర్భంగా ప్రజలిచ్చిన అర్జీలలోని సమస్యలను పరిష్కరించిన 10–1, అడంగల్ తదితర పత్రాలను ఆర్డీవో సంబంధిత ప్రజలకు పంపిణీ చేశామన్నారు. తమకు ప్రజలిచ్చే అర్జీల్లోని సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నామని, రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తున్నామని, రికార్డుల్లో ఏదేని తప్పి దాలుంటే సరిచేయనున్నామని పద్మజాకుమారి పేర్కొన్నారు. ఈసందర్భంగా




తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలిచ్చిన అర్జీలను ఆమె స్వీకరిం చారు. త్వరితగతిన సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రెవిన్యూఇన్స్‌పెక్టర్ ఎస్.కొండయ్య, విఆర్‌వో వి.మురళీధరరావు, తెలుగుదేశం నాయకులు వీరపురెడ్డి సుదర్శన్‌రెడ్డి, నువ్వురుపాడు తెలుగుదేశం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలీ, షేక్ ఖాజావలీ, వివిద శాఖల అధికారులు, పంచాయతీకార్యదర్శి, సచివాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న పల్లాల

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం నల్లగొండ గ్రామంలో వెలసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గృహ మల్లేశ్వర లక్ష్మీనరసింహస్వామి వారి ఆల యంలో వింజమూరు నివాసి నెల్లూరు జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు పల్లాల కొండా రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరిం చుకొని స్వామివారి ఆలయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకోవడం వల్ల సకల శు భాలు కలుగుతాయని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు పరంకుశంసత్యనారాయణ చార్యులు స్వామివారి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూరం వినోద్ రెడ్డి మల్లికార్జున్ రెడ్డి భయపరెడ్డి రామసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.



## టీడీపీ జిల్లా అధ్యక్షులు బీదను కలిసిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల నెల్లూరు జిల్లా అధ్యక్ష పదవిని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీద రవిచంద్రను నియమించడం జరిగింది. కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ వారు సంబరాలు జరుపుకున్నారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఉన్నప్పటికీ కూడా ఈ కార్యక్రమానికి కొన్ని కారణాల వల్ల హాజరు కాలేకపోయారు. హైదరాబాదులో టిడిపి జిల్లా అధ్యక్షులు ఉన్న విషయాన్ని తెలుసుకొని తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర వారి గృహానికి వెళ్లి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం కావలి నియోజకవర్గం రాజకీయ పరిస్థితుల గురించి కొంత సేపు మాట్లాడుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనాప్పటికీ కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో రోజురోజుకీ వ్యతిరేకత పెరుగుతుందనడంలో సందేహం లేదు.

## ముందస్తు అరెస్టులు దారుణం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పర్యా వరణానికి హానికరంగా మారే ఇంధ నల్ కంపెనీని దగదర్తి మండలంలో స్థాపించే నిమిత్తం ప్రభుత్వం ఏర్పా టు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనకుండా పోలీసులు' సీపీఎం పార్టీ నాయకులకు నోటీసులు జారీ చేసి ముందస్తు అరెస్టులు చేయడం దారుణమని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రజా భిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనకు ఉదయగిరి పోలీసులు నోటీసులు జారీ గృహనిర్బంధించడం దారు ణమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలను వెల్లడించకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఇంధనల్ పరిశ్రమ ఏర్పాటుతో ప్రజలు, పర్యావరణానికి తీవ్ర ముప్పు ఉంటుందని, ఈ పరిశ్రమ స్థాపనను ప్రతిఒక్కరు వ్యతిరేకించాలన్నారు.

## ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు

- ఉత్తర ద్వార దర్శనంతో అధిక సంఖ్యలో భక్తులు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ముక్కోటి ఏకాదశి సందర్భంగా జలదంకి మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి పూజలలో పాల్గొని ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించు కున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి కోలాటాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారినీ బుజస్కందా లపై మోస్తూ వీధుల్లో ఊరేగించారు. భక్తులు విచ్చేసి స్వామివారికి కాయ, కర్పూరం, పుష్పం, పత్రం అందించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కూరపాటి మాల కొండారెడ్డి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ప్రత్యేక ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణక్రాక త్రివేంగలాచార్యులు అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజే శారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అందుబాటులో ఎరువులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని సొసైటీ సీఈఓ పోలయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యాలయంలో ఫాస్పేట్, డీఏపీ, యూరియా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుల జెరాక్స్ వస్తే అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వి నియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ముక్కోటి ఏకాదశి.. ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేకం

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ముక్కోటి ఏకాదశి పరమ పవిత్ర ఘనంగా భక్తులు భావిస్తారు. ఈ రోజున వైష్ణవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేకంగా ఉంటుంది ముక్కోటి ఏకాదశి అనగా శ్రీమహావిష్ణువు యోగనిద్ర నుండి మేల్కొని దర్శనమిస్తారని భక్తుల విశ్వాసం ఈ రోజునే ముక్కోటి దేవతలు శ్రీమహావిష్ణువుని దర్శించుకోవడానికి వస్తారని అందువల్ల ఉత్తర ద్వార దర్శనం పరమ పుణ్యధామంగా వెలసిలుతుందని ఈ పండుగను ప్రత్యేకంగా భక్తి విశ్వాసాలతో జరుపుకుంటారు. అందులో భాగంగానే మంగళవారం అన్ని వైష్ణవాలయాలలో ఉదయాన్నే భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో ఉన్న నీలగిరి పర్వతంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ చార్యులతో కలిసి ఆలయ కమిటీ పాలకమండలి చైర్పర్సన్ లెక్కల కాంతరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి భక్తుల దర్శనార్థం ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా మాజీ పాలకమండలి చైర్మన్ లెక్కల చిన్న కొండారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల భక్తులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి వచ్చారని ఇది స్వామివారి లీల విశేషం అన్నారు. ఆలయ అభివృద్ధి కోసం భక్తుల సౌకర్యం కలిగించేందుకు కళ్యాణ మండపం అన్నదాన సత్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తూ భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కలిగిస్తున్నామన్నారు. అదేవిధంగా వింజమూరులోని తిరుమల నగర్‌లో వేంచేసియున్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి



ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు తిరుమల చారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు అలాగే స్వామి వారిని మాడవీధులలో ముమ్మారు ప్రదక్షిణం చేశారు అలాగే శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో ముక్కోటి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే నడిమూరు నందు వేంచేసియున్న మీ గురప్ప స్వామి అంకాలమ్మ నాగవరపు అమ్మ అమ్మవారి ఆలయంలో గురువారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే ఆలయాల చేరి ప్రత్యేక పూజలు జరిపించారు. హరినామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి మండల పరిషత్ ఇన్చార్జి ఎంపీపీ ఆనంగి రమణయ్య బొమ్ము నరసింహారెడ్డి పెంచల్ రెడ్డి అన్నపరెడ్డి ధర్మారెడ్డి అన్నపురెడ్డి పాలెడ్డి స్థానిక నాయకులు తదితరులున్నారు.

# రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన కెఎన్ఆర్ విద్యార్థులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర స్థాయిలో జరిగిన వృత్తి విద్య మెగా కాంపిటేషన్ కార్యక్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన నెల్లూరు కేఎన్ఆర్ హైస్కూల్ విద్యార్థులు ఒకేషనల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి సాధించి తమ సత్తా చాటారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన కేఎన్ఆర్ హైస్కూల్ విద్యార్థులు, రాష్ట్రస్థాయిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని పాల్గొన్న మొదటి సంవత్సరంలోనే ఏకంగా మూడో స్థానం కైవసం చేసుకుని నెల్లూరు జిల్లా పేరును రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొని వచ్చేలా నిలిచారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరు నిలిచేలా చేసిన ఒకేషనల్ ఉపాధ్యాయిని రాగి కళ్యాణి ని జిల్లా విద్యాశాఖ అధికారి ,జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా రాగి కళ్యాణి మాట్లాడుతూ తమ కెఎన్ఆర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయ ప్రకాష్ ప్రోత్సాహం ఉపాధ్యాయులు రవీంద్ర కిరణ్ కుమార్ సహకారం, విద్యార్థులు నందిని, కల్పన, రోషిని, గౌరీ, మహాలక్ష్మి, అవినాష్‌ల కృషి పట్టుదలతో, జిల్లా విద్యాశాఖ అధికారుల నమ్మకం తో తాము ఈ ఘనత సాధించామని తెలిపారు. ఇదే పట్టుదలతో రాబోయే రోజుల్లో మొదటి స్థానంలో నిలుస్తామని తెలిపారు. పిల్లలను అనునిత్యం ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను సైతం ఆమె అభినందించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలు మంజూరు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుద్ధ నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక అల్లీపురంలోని టిడ్కో గృహాల ప్రాంగణాన్ని మంగళవారం సందర్శించారు. టిడ్కో గృహాల ప్రాంగణంలో తాగునీటి వసతి, పచ్చదనం, మొక్కల పెంపకం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై నిరంతరం సంబంధిత సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. టిడ్కో గృహాలలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం గృహాలను మంజూరు చేస్తుందని స్థానిక ప్రజలకు కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, శానిటేషన్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలకి జిల్లా స్థాయి గౌరవం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల వెంకటాచలంలో బుధవారం మెడికల్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ శ్రీమతి హరి ప్రియా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్ల వల్ల అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశముందని, వాటిని నివారించేందుకు సమతుల ఆహారం తీసుకోవడంతోపాటు ప్రతి రోజు శారీరక వ్యాయామం ఎంతో అవసరమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గౌరవ ఆర్ఐఓ శ్రీ వరప్రసాద్ రావు, జిల్లా స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీలో ద్వితీయ బహుమతి సాధించిన కళాశాల విద్యార్థిని ఎస్కే సాదికా అంబరీన్ను అభినందించి బహుమతి అందజేశారు. ఆమె సాధించిన ఈ విజయంతో కళాశాలకు జిల్లా స్థాయిలో గౌరవం దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేషన్ మార్గదర్శకాలు తప్పనిసరి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక 24 వ డివిజన్ గొలగమూడి రోడ్డులోని అభయాంజనేయ స్వామి విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ వరల్డ్ లేఔట్ విస్తీర్ణం, ఓపెన్ సైట్, అనుమతుల మంజూరు కోసం క్షేత్రస్థాయిలో తనిఖీ చేసేందుకు మంగళవారం పర్యటించారు. పట్టణ ప్రణాళిక విభాగం మంజూరు చేసిన అనుమతుల మేరకు లేఅవుట్ లోని అన్ని నిర్మాణాలను, పన్నుల విధింపులను ప్లాన్ కాపీతో సరిపోల్చారు. నెల్లూరు నగర పాలక సంస్థ నిర్దేశించిన అన్ని మార్గదర్శకాలను తప్పనిసరిగా లేఅవుట్ నిర్మాణంలో పాటించాలని లేఔట్ యజమానులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంచార్జ్ సిటీ ప్లానర్ రఘునాథరావు, ఏసీపీలు, టీపీబివోలు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోటీలలో మొగళ్ళూరు విద్యార్థుల ప్రతిభ




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దర్గా మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్పెల్ – బీ పోటీలలో పొదలకూరు మండలం మొగళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. 9వ తరగతి విభాగంలో వై.లోకేష్ ప్రథమ స్థానంలో నిలిచి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఏడవ తరగతి విభాగంలో ఎం.కుసుమశ్రీ ద్వితీయ స్థానం సాధించింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించి జోనల్ స్థాయికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## సమస్యల పరిష్కారం కోసమే కరంటోళ్ల జనబాట



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు గ్రామాలలో ఉండేటువంటి విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కరెంటోల్ల జన బాటా కార్యక్రమం నిర్వహించిందని లైన్ ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య అన్నారు. వరికుంటపాడు మండల పరిధిలోని జడదేవి గ్రామంలో మంగళవారం విద్యుత్ శాఖ ఏఈ ఖుదూద్ బాషా ఆధ్వర్యంలో కరెంటోల్ల జనబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి విద్యుత్ సమస్యలను తెలుసుకొని ఆ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఏడుకొండలు, వెంకటేష్, ఏ వెంకటేశ్వర్లు, సుదర్శన్, చందు, నవీన్, రైతు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 10:30 గంటలకు కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశం మందిరంలో నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగనుంది.

# అంబరాన్నంటిన సంబరం



- నెల్లూరులోనే రాపూరు స్పష్టం చేసిన ఎమ్మెల్యే
- ప్రజల ఆవేదనకు విలువ ఇచ్చిన ప్రభుత్వం
- సీఎం, డీసీఎం, జిల్లా మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు
- ఎమ్మెల్యే కురుగొండ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు
- పట్టణంలో బాణాసంచాలు పేల్చి స్వీట్లు పంపిణీ
- దీక్ష శిబిరం వద్ద హైడ్రామా చెన్ను వర్గం వర్సెస్ ఎమ్మెల్యే వర్గంగా నినాదాలు
- రెండు వర్గాలుగా విడిపోయిన తెలుగుదేశం పార్టీ నాయకులు
- శ్రీపొట్టి శ్రీరాములు స్ఫూర్తితో విజయం సాధించిన శాంతియుత ఉద్యమం
- కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం

**రాపూరు, మేజర్‌న్యూస్ :** తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే గొడుగు కిందకి రావాలన్న సంకల్పంతో ఆనాడు అమరదేవి శ్రీపొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహార దీక్షను స్ఫూర్తిగా తీసుకొని ఆయనకు గుర్తుగా రాపూరు మండలాన్ని నెల్లూరు జిల్లాలో కాకుండా తిరుపతి జిల్లాల్లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ శాంతి యుత ఉద్యమాన్ని చేపట్టిన రాపూరు ప్రజలు నేడు సంబరాల్లో మునిగితేలారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాపూరు మండలాన్ని యధావిధిగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనే కొనసాగిస్తూ నిర్ణయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనతో ప్రజలు ఆనందోత్సాహాల నడుమ మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు మంగళవారం రాపూరు పట్టణంలో సమిష్టిగా రాజకీయ పార్టీ నాయకులు, యువకులు, ప్రజలు శాంతియుతంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ఉద్యమంలో పాల్గొన్న అందరూ కలిసి తమ



ఆనందాన్ని పంచుకున్నారు. జేఏసీ నిరాహార దీక్ష వేదిక ప్రాంతంలో యువకులు పెద్ద ఎత్తున ఆనంద సంబరాలు జరుపుకొని, భారీగా బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. రాపూరు మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగుతుంది అన్న ప్రభుత్వ స్పష్టీకరణ వార్త నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ జేఏసీ నిరాహార దీక్ష శిబిరం

చేసి తమ ఆనందాన్ని పంచుకుంటూ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాపూర్ను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే పద్యంలో మంగళవారం జేఏసీ నాయకులు గత నెలలుగా చేపట్టిన ధర్నా ప్రదేశానికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముందుగా భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గత నెల రోజులుగా తమ మండలాన్ని తిరుపతిలో విలీనం చేయొద్దు నెల్లూరులోనే ఉంచండి అనే నినాదంతో శాంతియుత నిరసన ఉద్యమాన్ని చేపట్టిన యువకులందరూ ఏకమై ప్రభుత్వం నిర్ణయాన్ని మనసారా స్వాగతిస్తూ సహకరించిన జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల, స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, స్థానిక మండల అధికార పార్టీ నాయకులు చెన్ను తిరుపాల్ రెడ్డి, చెన్ను అశోక్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ దామిశెట్టి సురేష్, అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులకు, మండల అధికారులకు, రాపూరు మండల ప్రజలకు, ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఉద్యమకారులు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.



### దీక్షశిబిరంలో గందరగోళ పరిస్థితి

గడచిన నెల రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలోనే రాపూరు ఉండాలని తిరుపతిలో విలీనం చెయ్యొద్దు అంటూ అన్ని వర్గాల ప్రజలు కలసి జేఏసీగా ఏర్పడి నిరసన ఉద్యమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన సమయం గడువు ముగుస్తున్న నేపథ్యంలో పట్టణంలో మరో వర్గం తెరపైకి వచ్చి నెల్లూరు జిల్లా వద్దు-తిరుపతి జిల్లా ముద్దు అనే నాదంతో కొంత ఆసక్తికర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన కూటమి నాయకులు స్థానిక ఎమ్మెల్యే వర్గంగా ప్రచారం సాగింది. ఒకానొక దశలో చెన్ను వర్గం వర్సెస్ ఎమ్మెల్యే కురుగొండ్ల వర్గంగా ఉద్యమాలు వేరువేరుగా చేస్తున్నట్టు గట్టిగా రాపూరు ప్రాంతంలో ప్రచారం జరిగింది. వినేపద్యంలో రాపూరును నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ రాకతో కొంత ఆ ప్రాంతంలో గందరగోళ వాతావరణం నెలకొంది. నెల్లూరు వద్దు అని చివర్లో ఉద్యమ బాట పట్టిన ఎమ్మెల్యే వర్గంగా చెప్పుకునే కొందరు నాయకులు ఎమ్మెల్యే జిందాబాద్, ఎమ్మెల్యే నాయకత్వం జిందాబాద్ నినాదాలతో ఆ ప్రాంతంలో కొంత హైడ్రామా నడిచింది ఒకానొక దశలో గొడవ జరిగే పరిస్థితి కూడా కనిపించింది. కానీ చివరికి ఎమ్మెల్యే రాకతో అందరూ కలిసి సంబరాలు జరుపుకున్నారు.

# వీఎస్‌యూలో సృజనాత్మక రచనా కోర్సు ముగింపు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ), నెల్లూరు లోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 12 రోజుల 'సృజనాత్మక రచన, వృత్తిపరమైన కంటెంట్ అభివృద్ధి' కోర్సు మంగళవారం వాలెడిక్టరీ కార్యక్రమంతో విజయవంతంగా ముగిసింది. ఈ కోర్సును కేంద్ర ప్రభుత్వ పథకం (ప్రధాన్ మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) ఆర్థిక సహకారంతో నిర్వహించారు. కోర్సు చివరి రోజున 'పబ్లిషింగ్ పాత్‌వేస్ అండ్ వాలెడిక్టరీ' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో డా. జి.రాజాకుమార్, సీనియర్ లెక్చరర్ (ఆంగ్లం), హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్, అడంకి ముఖ్యఅతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం అందించారు. ఆయన కంటెంట్ రైటింగ్, ఫ్రీలాన్సింగ్, గోస్ట్ రైటింగ్, టెక్నికల్ కమ్యూనికేషన్ వంటి రంగాలలో ఉన్న వృత్తి అవకాశాలు, అలాగే ప్రచురణ రంగానికి సంబంధించిన మార్గాలపై వివరించారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్‌లో కోర్సులో పాల్గొన్న విద్యార్థులు, పరిశోధనా విద్యార్థులు తమ ఫైనల్ పోర్ట్‌ఫోలియోలను ప్రదర్శించారు. 12 రోజుల శిక్షణలో వారు సాధించిన సృజనాత్మకత, భాషా నైపుణ్యం, రచనా నిర్మాణం, వృత్తిపరమైన ప్రెజెంటేషన్‌లో వచ్చిన పురోగతి స్పష్టంగా కనిపించిందని నిర్వాహకులు తెలిపారు. వాలెడిక్టరీ కార్యక్రమంలో కోర్సు సమన్వయకర్త డా. బిఎస్ఎస్. భగవాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్, విఎస్‌యు కాలేజ్, నెల్లూరు సమగ్ర నివేదికను




సమర్పించారు. అనంతరం డా. కె.సునీత, రిజిస్ట్రార్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, డా. టి.వీరారెడ్డి, ప్రిన్సిపాల్, విఎస్‌యూ కాలేజ్, నెల్లూరు గారు పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి డా. బిఎస్ఎస్ భగవాన్ ప్రధాన సమన్వయకర్తగా, డా. ఆర్.ప్రభాకర్ సహ-సమన్వయకర్తగా వ్యవహరించారు. అకాడమిక్ సపోర్ట్ టీమ్‌గా డా. బి.స్యామ్యూల్ మార్క్, వి.భాగ్య జ్యోత్స్న గెస్ట్ ఫ్యాకల్టీగా సేవలందించారు. ఈ కోర్సులో అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు, విద్యార్థులు, రచనపై ఆసక్తి ఉన్న అనేక మంది ఉత్సాహంగా పాల్గొని, సృజనాత్మక, వృత్తిపరమైన రచనా నైపుణ్యాల అభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన డాక్టర్ చిల్లూరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో యాదవ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోపియేషన్ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు, స్థానిక చిన్నపిల్లల వైద్యనిపుణులు, మాజీ జెడ్పిటిసి మెంబర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య ఆవిష్కరించారు. ఈక్యాలెండర్‌లో అన్ని వివరాలను పొందుపరిచి ప్రజలకు అందజేయడం సంతోషదాయకమని ఆయన పేర్కొన్నారు. అసోసియేషన్ తమ హక్కులపరిరక్షణ, సమస్యల పరిష్కారంతోపాటు అందరికీ ఉపయోగపడేలా క్యాలెండర్లు రూపొందించడం అభినందనీయమని డాక్టర్ ఆదిశేషయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, డాక్టర్ చిల్లూరు ఆత్మీయులు గుర్రం నాగేశ్వరరావు, గంగుల మధుసూధన్, పొడమేకల పెంచలయ్య, ఒంటేరు మల్లికార్జున, దేగా ప్రసాద్, బత్తల శ్రీనివాసులు, నల్లిబోయిన వెంకటేశ్వర్లు, సన్ను రామకృష్ణ, కొల్లిబోయిన మల్లికార్జున, కటారి సుధాకర్, గాలిబోయిన అయ్యన్న, గుండుబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని బిజెపి కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు సిఫా రెడ్డి వంశీధర్ రెడ్డి ఆదేశాల మేరకు

## వింజమూరు బీజేపీ మండల కమిటీ నియామకం

మండల అధ్యక్షులు అంబటి ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు ప్రధాన కార్యదర్శిగా మల్లం కొండారెడ్డి మేడ బలిమి రామచంద్రయ్య ఉపాధ్యక్షుడిగా మాదినే నాగేశ్వరరావు గంగిశెట్టి హజతయ్య భయ్యపి రెడ్డి సంధ్యారాణి లెక్కమునని రాజేష్ దాసరి ప్రసాద్ లు కాగా కార్యదర్శులుగా సింగం రెడ్డి సుధాకర్ రాజా రమేష్ ఎర్రబోయిన అనిత పత్తిపాటి విజయభాస్కర్ ఏ సుధామణి కార్యవర్గ సభ్యులుగా ఎల్లాల రమణారెడ్డి బొద్దుకూరి రమణయ్య నియామకం కాక సోషల్ మీడియా కన్వీనర్‌గా దాదిరెడ్డి నారాయణరెడ్డి బీజేవైఎం అధ్యక్షులుగా బయపరెడ్డి గోవర్ధన్ నియమించడం జరిగిందని అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

## రామాలయంలో ఉప్పల ప్రత్యేక పూజలు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని మంగళవారం అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని రామాలయంలో ముక్కోటి ఏకాదశి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చంద్రమౌళి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమశిల మాజీ సర్పంచ్ ఉప్పల విజయ్ కుమార్, ఉప్పల సీతమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్తర ద్వార దర్శనం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంజాద్ ఖబర్దార్..

- పొదలకూరునీ జాగీరా..
- నీవేమైనా నిజాం నవాబువా! లేక పొదలకూరు నవాబువా!
- ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రవర్తించు
- తస్మాత్ జాగ్రత్త ! ● టీడీపీ నాయకుల హెచ్చరిక



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** అంజాద్ పొదలకూరు నీ జాగీరా.. నీవేమైనా నిజాం నవాబు లాగా పొదలకూరు నవాబ్ అనుకుంటున్నావా! మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు ఖబర్దార్ అంటూ వైసీపీ నాయకుడు, వార్డు మెంబర్ షేక్ అంజాద్‌ను పొదలకూరు టీడీపీ నాయకులు హెచ్చరించారు. పొదలకూరు శివాలయంలో మంగళవారం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పల్లారపు కృష్ణ యాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడులు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇరిగేషన్ పనుల్లో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేసే వైసీపీ నాయకులు నిరూపించాలని సవాల్ విసిరితే తోక ముడిచి వెళ్ళారని ఆరోపించారు. తమ కూటమి పాలనలో ఎలాంటి అవినీతి జరగలేదని చెప్పిన మాట ప్రకారం తాము ప్రమాణం చేసేందుకు శివాలయంకు వచ్చామని అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి జరగలేదని ప్రమాణం చేసేందుకు సిద్దమైతే ఆ పార్టీ నాయకులు రావాలని చాలెంజ్ చేస్తే పత్తా లేకుండా పోయారని విమర్శించారు. దీన్నిబట్టి వైసీపీ వన్నీ అసత్య ఆరోపణలేనని తేలిపోయిందన్నారు. వైసీపీ నాయకులు రెచ్చిపోయి మాట్లాడుతున్నారని మా ప్రభుత్వంలోనే మమ్మల్ని పొదలకూరులో అడుగుపెట్టనివ్వమని మాట్లాడడం వారి రౌడీయిజానికి పరాకాష్ట అని అన్నారు. వైసీపీ నాయకుల్లారా వ్యక్తిగత ఆరోపణలకు పోతే మేమేమి గాంధీ మహాత్ములం కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. వైసీపీ నాయకులెవరైనా వ్యక్తిగత ఆరోపణల జోలికెళ్తే తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. రాజకీయంగా సబ్జెక్టు మీద ఎంతవరకైనా మాట్లాడండి కానీ వ్యక్తిగత దూషణలకెళితే చూస్తూ ఊరుకోమన్నారు. రెండు రోజులు సమయం ఇచ్చి చర్చకు పిలిస్తే రాకుండా పారిపోయి మీడియా సమావేశాలకే పరిమితమైన వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. తొలుత పొదలకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ యువ నాయకులు కలగట్ల సందీప్, ఆదాల మురళి రెడ్డి, బ్రహ్మదేవి చంద్రశేఖర్ లు కూడా ఇదే విషయం పై మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, టిడిపి యువ నాయకులు కరియావుల శ్రీనివాసులు నాయుడు, అనిశెట్టి వీరేంద్రబాబు, అయితా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు అంశాలపై చర్చకు సిద్ధం..

- టీడీపీ నాయకులకు వైసీపీ అల్టిమేటం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** నిర్దిష్టంగా తాము ప్రతిపాదించే నాలుగు అంశాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు సమాధానం చెప్పేందుకు సిద్ధమైతే తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ నాయకులు అల్టిమేటం పంపారు. పొదలకూరులో మంగళవారం సాయంత్రం వైసీపీ నాయకులతో కలిసి బిట్-4 ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము స్పష్టంగా చెబుతున్నామని సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ పనుల్లో జరిగిన అవినీతి, లేఔట్ యజమానుల దగ్గర డబ్బులు తీసుకోవడం, దేవుని భూములు అమ్మకానికి పెట్టడం, గొలగమూడిలో సంత ఏర్పాటు చేయడంలో సోమిరెడ్డి ప్రమేయం లేదని ప్రమాణానికి సిద్ధమైతే తాము కూడా ప్రమాణం చేసేందుకు సిద్ధమని పేర్కొన్నారు. రమణారెడ్డి కాలనీలో అంజాద్ భాషా బావి పూడ్చి అమ్ముకున్నాడని ఆరోపణలు చేయడం కాదని ప్రభుత్వం మీ చేతుల్లో ఉందని నిరూపించాలని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జిల్లా వైసీపీ యువజన విభాగం కార్యదర్శి చెమికుల వెంకటేశ్వర్లు (వెంకీ), కోవూరు సన్నీ, ప్రసాద్, వెన్నపూస శివా రెడ్డి, ప్రశాంత్, వార్డు సభ్యుడు హరి, మస్తాన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సతీమణితో కలిసి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి నారాయణ

- ఆలయానికి వచ్చిన మంత్రికి ఘన స్వాగతం పలికిన అర్చకులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి దంపతులు
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడించిన మంత్రి
- ఆలయాల వద్ద విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపిన మంత్రి





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా నెల్లూరు రూరల్ పరిధిలోని నరసింహకొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని మంగళవారం సతీమణి రమాదేవితో కలిసి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దర్శించుకున్నారు. ఉత్తరద్వార దర్శనానికి వచ్చిన మంత్రికి ఆలయమర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారి ఆలయాల్లో మంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా నరసింహకొండపై వైకుంఠ ఏకాదశి సందర్భంగా తమకుటుంభ ఉభయం ఉంటుందన్నారు. లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని వేడుకొన్నానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి, స్వామివారి కృపకు పాత్రులవుతున్నారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వివరించారు.

# గోవింద నామాలతో మారుమోగిన వైకుంఠ ద్వార దర్శనం



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు మజారా గ్రామమైన వైకుంటపురం గ్రామంలో వెలిసి ఉన్నటువంటి శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు భక్తులకు స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి స్వామి అమ్మవార్లను ప్రత్యేక రథంపై ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకొని వచ్చే ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. క్యూలైన్లో వేలాదిగా భక్తులు టెంకాయలు కొట్టి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు దంపతులు, జడ్పిటిసి రావిళ్ళ నాగేంద్ర, మండల క్లస్టర్ కో కన్వీనర్ పేరం సుధాకర్ రెడ్డి దంపతులు, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి వచ్చినటువంటి భక్తులు అందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వేలాదిమంది స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉదయగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి ఏకాంత సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని పలు రకాల పుష్పాలు పలు రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అన్న ప్రసాదాల కొరకు సహకరించినటువంటి దాతలకు ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ అమ్మాజీ దంపతులు స్వామి వారి చిత్రపటంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు.

# అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి గ్రామోత్సవం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం జరిగిన వైకుంఠ ఏకాదశి మహోత్సవంలో భాగంగా స్వామి వారి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా ఆలయ అధికారులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.గిరికృష్ణ, ఆలయ చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, సభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని జరిపించారు. ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామోత్సవాన్ని చేశారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పొందారు.

# హౌసింగ్ ఎండిని కలిసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ విభాగం మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌బాబును నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ మంగళవారం స్థానిక మినర్వా గ్రాండ్ హొటల్లో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను బహుకరించారు. నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించిన హౌసింగ్ అంశాలపై ఇరువురు చర్చించారు.

# ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన తహసిల్దార్



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి వంద రోజులు ప్రాణాలకు లో భాగంగా అనంత సాగరం మండలం అనంతసాగరం గ్రామంలోని టీజేఎన్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ బి జయవర్ధన్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో పలు పాఠంశాలపై చర్చించారు. వంద రోజులు ప్రణాళికలు పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పదో తరగతి విద్యార్థుల సంఖ్య వివరాలను ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.